శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహస్వామి నిత్యారాధనలు

ఊంజల్ సేవలో భాగంగా అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా సాగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం జరిపారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.17,25,786 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

కొండపైన మద్యం బాటిళ్లు, గుట్కా ప్యాకెట్లు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అపశృతి చేటు చేసుకుంది. కొండపైన నిషేధిత మద్యం బాటిళ్లు, గుట్కా ప్యాకెట్లు ప్రత్యక్షమయ్యాయి. క్యూ కాంప్లెక్స్ పైన కొండపైకి వెళ్లే మార్గంలో మూత్ర విసర్జనశాల, మరుగుదొడ్లలో మద్యం బాటిళ్లు, నిషేధిత గుట్కా ప్యాకెట్లు కనిపించాయి. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ పడేసి ఉంటారని దేవస్థాన అధికారులు భావిస్తున్నారు. వాటిని గుర్తించి వెంటనే తొలగింపు చర్యలు చేపట్టామని ఆలయ ఈఓ భాస్కర్ రావు తెలిపారు. ఇలాంటి ఘటనలకు తావు లేకుండా చర్యలు చేపడుతామన్నారు.

కొండపైకి వచ్చే సమయంలో భక్తుల లగేజీలు, వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేశాకే కొండపైకి అనుమతిస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కావని భక్తులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల రాస్తారోకో

రాజాపేటలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

రాజాపేట, జూలై 5 : పాఠశాల వేళలకు బస్సు సౌకర్యం కల్పించాలని కొన్‌రెడ్డిచెర్వు, పుట్టెగూడెం గ్రామాల విద్యార్థులు శుక్రవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం ఇంటికి వెళ్లడానికి సకాలంలో బస్సు సౌకర్యం లేదని, ఆర్టీసీ బస్సు కోసం రాత్రి 7:30 వరకు వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. సకాలంలో బస్సు నడిపించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరారు.

పాత ఇనుప సామాను షాపును తొలగించాలని నోటీసు

పాత ఇనుప సామాను షాపు యజమానికి నోటీసులు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

అడ్డగూడూరు, జూలై 5 : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో అతిథి బార్ వెనుకాల నిర్వహిస్తున్న పాత ఇనుప సామాను షాపును తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన ఆయన షాపును ఖాళీ చేయాలని యాజమానికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

ఎరువుల దుకాణంలో బిల్ బుక్కులను పరిశీలిస్తున్న ఏడీఏ పద్మావతి, ఏఓ సుజాత

మోటకొండూరు, జూలై 5 : మండల కేంద్రంతోపాటు కాటేపల్లి, చాడ గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఏడీఏ పద్మావతి, ఏఓ సుబ్బూరి సుజాతతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని బిల్ బుక్కులను పరిశీలించారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయా.. లేదా? అని డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చాడ గ్రామంలో జీలుగు, పత్తి పంటలను పరిశీలించారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని బతుకమ్మ

సర్వేపల్లిలో వర్షం కోసం బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆత్మకూరు(ఎం), జూలై 5 : వరుణదేవుడు కరుణించి వర్షాలు కురువాలని కోరుతూ మండలంలోని సర్వేపల్లిలో శుక్రవారం మహిళలు బతుకమ్మ ఆడారు. ప్రతి ఇంటి నుంచి నీటి బిందెలతో తరలివచ్చి బొడ్రాయి వద్ద బతుకమ్మ ఆడిపాడారు. నెల రోజుల క్రితం కురిసిన మోస్తరు వర్షాలతో మురిసిపోయిన రైతులు.. దుక్కులు దున్ని పత్తి, ఇతర విత్తనాలు వేశారు. వర్షాలు లేకపోవడంతో మొలకెత్తిన విత్తనాలు వాడిపోతున్నాయి. ఈ క్రమంలో వర్షాల కోసం బతుకమ్మ ఆడుతున్నట్లు మహిళలు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి కృషి : మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



మున్సిపల్ కార్మికులకు నూనె, సబ్బులు అందజేస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భూదాన్ పోచంపల్లి, జూలై 5 : కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, నీటి సరఫరా సిబ్బందికి శుక్రవారం నూనె, సబ్బులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ శ్రీరాములు, అధికారులు రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

మున్సిపల్ చైర్మన్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చౌటుప్పల్, జూలై 5 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కళాశాలలో మట్టి కుప్పలతోపాటు చెత్తా చెదారాన్ని తొలగించాలని, ఇందుకోసం ఒక స్వీపర్‌ను కేటాయించాలని అన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ నాయకులు తీగుళ్ల శ్రీనివాస్, ప్రకాశ్, మహేశ్, మణికంఠ, వినయ్ పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే
- జనంపల్లి రెసిడెన్షియల్ పాఠశాల సందర్శన

గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

రామన్నపేట, జూలై 5 : గురుకుల పాఠశాలలు, వసతి గృహాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. మండలంలోని జనంపల్లి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, హాజరు పట్టిక, భోజన పట్టికను పరిశీలించారు. అనంతరం వివిధ సబ్జెక్టుల బోధన, భోజనం, వసతి సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నులిపురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకున్నారా? అని అడిగారు. హాస్టల్‌లో వంట గది, స్టోర్‌రూమ్, డార్మినేటరీ, వాష్ రూములను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పారిశుధ్యం, పరిశుభ్రత ముఖ్యమని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్ రాజానను ఆదేశించారు. అనంతరం హాస్టల్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి బి.అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఎండీ ఖదీర్, రమాదేవి ఉన్నారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే తాసీల్దార్‌ను ఆదేశించారు. శుక్రవారం తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి దరఖాస్తులు, రిజిష్టర్లను పరిశీలించారు. దరఖాస్తులను పెడింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యాలయానికి వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తాసీల్దార్ లాల్‌బహదూర్, సీనియర్ అసిస్టెంట్ గాలయ్య ఉన్నారు.

బీఆర్ఎస్‌వీ నాయకుల ముందస్తు అరెస్ట్

- టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి బయల్దేరిన విద్యార్థి నాయకుల అడ్డగింత

వలిగొండలో ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

మోటకొండూరు : బీఆర్ఎస్‌వై ఆలేరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణంరాజును అరెస్టు చేసిన పోలీసులు

మోటకొండూర్, జూలై 5 : ఉద్యోగాల భర్తీ కోసం బీఆర్ఎస్‌తోపాటు విపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి, నిరుద్యోగ మార్చ్‌ను విఫలం చేసేందుకు పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. బీఆర్ఎస్‌వై ఆలేరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీస కృష్ణంరాజుతో పాటు పలువురిని ఉదయమే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కి నిరుద్యోగులను మోసం చేస్తుందని బీఆర్ఎస్‌వై నాయకులు అన్నారు.

రామన్నపేట (వలిగొండ) : నిరుద్యోగ మార్చ్ నేపథ్యంలో మండలంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగ మార్చ్‌ను అడ్డుకోవడానికి విద్యార్థి సంఘాల నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని పలువురు ఖండించారు. వలిగొండ మండలంలో ఎర్ర కిరణ్, మేడి దేవేందర్‌ను అరెస్టు చేశారు.

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలి

- బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేశ్

బీబీనగర్, జూలై 5 : రెండున్నర లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగ నిరసన ర్యాలీ, టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడి నేపథ్యంలో గురువారం రాత్రి నగేశ్‌తోపాటు విద్యార్థి నాయకులు ఎండీ మున్నా, ఏర్పుల అరవింద్, కంకల మహేశ్‌ను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ గ్రూప్ 1 పోస్టుల సంఖ్య పెంచాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, మెగా డీఎస్సీ వేయాలని, జీఓ 46 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం : బీఆర్ఎస్

బీబీనగర్, జూలై 5 : విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం రాత్రి విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయగా.. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాల్సిందిపోయి అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. విద్యార్థులు తమ హక్కుల సాధన కోసం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడం అన్యాయమని, అక్రమ అరెస్టులను మానుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మంచాల రవికుమార్, గోరుకంటి బాలచందర్, చింతల సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ వద్ద బీజేవైఎం ధర్నా.. నాయకుల అరెస్టు

భువనగిరి కలెక్టరేట్ : ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 5 : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గ్రూప్-2 పోస్టులను 2వేలకు, గ్రూప్-3 పోస్టులను 3వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షల మధ్య వ్యవధిని పెంచాలన్నారు. మెగా డీఎస్సీ వేయాలని, డీఎస్సీని 2నెలలు వాయిదా వేయాలని కోరారు. ఉద్యోగ నియామకాల అనంతరం బ్యాక్‌లాగ్ ఖాళీలు ఏర్పడకుండా 2వ లిస్ట్ ప్రకటించి నియామకాలు జరుపాలని, మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్ కేటాయించాలని అన్నారు. జీఓ 46ను రద్దు చేసి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు దిండు భాస్కర్‌గౌడ్, బూరుగు మణిగౌడ్, దయ్యాల కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

యువజన నాయకుల అరెస్ట్

ఆలేరు రూరల్/ ఆత్మకూర్ (ఎం)/ భూదాన్ పోచంపల్లి/ చౌటుప్పల్ : కలెక్టరేట్ ముట్టడికి వెళ్లేందుకు ఆయా మండలాల నుంచి సిద్ధమైన బీజేవైఎం నాయకులను శుక్రవారం స్థానిక పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంతుల శంకర్, ఆలేరు మండల, పట్టణ అధ్యక్షులు కొరుటూరి మధు, శివ, ఆత్మకూర్ (ఎం)లో ప్రశాంత్, మహేశ్‌గౌడ్, సూర్యప్రకాశ్, సాయికుమార్, మధు, వలిగొండలో అశోక్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశం, మల్లేశం, నరేశ్, పోచంపల్లిలో జగదీశ్, శ్రీకాంత్, నవీన్, సురేశ్, విజయకుమార్, చౌటుప్పల్‌లో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కిశోర్, నాయకులు నరేశ్, విష్ణుకాంత్ ఉన్నారు.

జీపీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

- గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్

సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్

భువనగిరి అర్బన్, జూలై 5 : గ్రామ పంచాయతీ కార్మికులకు 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ అన్నారు. పట్టణంలో జీపీ కార్మికులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వేలాది మంది మల్టీపర్పస్ వర్కర్లకు నెలకు రూ.9,500 అతి తక్కువ వేతనం ఇస్తున్నారన్నారు. అది కూడా నెలనెలా సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 60 వేల సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పీఆర్సీ నివేదిక ప్రకారం 30శాతం ఫిట్‌మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు దాసరి పాండు, జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, ప్రధాన కార్యదర్శి గడ్డం ఈశ్వర్, నాయకులు యాదగిరి, ఐలయ్య, కృష్ణయ్య, సలీమ్, అనిత, పరశురామ్, దశరథ, శ్రీధర్ పాల్గొన్నారు.

10న కార్మికుల హక్కుల దినోత్సవం పాటించాలి : మల్లేశం

ఆత్మకూరు(ఎం), జూలై 5 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న కార్మిక హక్కుల దినోత్సవాన్ని పాటిస్తూ జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం అన్నారు. శుక్రవారం హక్కుల దినోత్సవం కరపత్రాలను మండల కేంద్రంలో విడుదల చేసి మాట్లాడారు. దేశంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని చెప్పిందన్నారు. సహజ వనరులైన బొగ్గుబావులను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకున్నదని చెప్పారు. మోదీ అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా ఈ నెల 10న కలెక్టరేట్ వద్ద, మండలాల్లోని తాసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కూరెళ్ల కిష్టయ్య, సుక్క రామచందర్, శ్రీనివాస్, లక్ష్మయ్య, నర్సింహ, రామచంద్రయ్య పాల్గొన్నారు.

రెడ్డిబావిలో వాహనాల బ్యాటరీల అపహరణ

చౌటుప్పల్ రూరల్, జూలై 5 : మండలంలోని రెడ్డిబావి గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు వాహనాల బ్యాటరీలను అపహరించారు. గ్రామానికి చెందిన నందగిరి వెంకటేశం, నందగిరి యాదయ్య, రేపాక యాదయ్య, పిసాటి నర్సిరెడ్డికి చెందిన మూడు డీసీఎంలు, రెండు ట్రాక్టర్ల బ్యాటరీలు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. వ్యవసాయ మోటర్ల వైర్లు కూడా అపహరిస్తున్నారన్నారు. రాత్రి వేళ పోలీసుల పహరా పెంచి దొంగతనాలు అరికట్టాలని, దొంగలను శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దేవులమ్మ నాగారంలో చోరీ

చౌటుప్పల్ రూరల్, జూలై 5 : మండలంలోని దేవులమ్మ నాగారం గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వరకాంతం సందీప్‌రెడ్డి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన తల్లి బాలమణి గ్రామంలోని ఇంట్లో ఉంటుంది. కాగా, మూడ్రోజుల క్రితం ఇంటికి తాళం వేసి అందరూ కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని ఇంటి పక్కన ఉన్న మహేశ్‌రెడ్డి గమనించి సందీప్‌రెడ్డికి సమాచారం ఇచ్చాడు. సందీప్‌రెడ్డి వచ్చి చూడగా బీరువా పగులకొట్టి ఉంది. అందులో ఉన్న తులం బంగారు చెవి గంటీలు, కొంత నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

అడ్డగూడూరు, జూలై 5 : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోటమర్తి గ్రామానికి చెందిన మందుల వంశీ (23) ఇటీవల పోక్సో కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. అనంతరం గ్రామంలో కొంత మంది జైలుకు వెళ్లి వచ్చావని బెదిరించగా.. మనస్తాపం చెంది గత నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలి : ఐద్వా

బొమ్మలరామారం, జూలై 5 : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బుట్టుపల్లి అనూరాధ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, వసతుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు బోదాసు నర్సమ్మ, పండుగ భారతమ్మ, కెంసారం పోయమ్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన వంశీకృష్ణ

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో బీఆర్ఎస్‌వీ నాయకుడు వంశీకృష్ణ

ఆత్మకూరు(ఎం), జూలై 5 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం మండలంలోని టి.రేపాక గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ నాయకుడు ఏనూతల వంశీకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సంతోషం వ్యక్తం చేశారు.

ఆందోళన వద్దు.. నష్టం కాకుండా చూస్తా

- చిన్నకొండూరు రోడ్డు విస్తరణ బాధితులతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రోడ్డు విస్తరణ బాధితులు

చౌటుప్పల్, జూలై 5 : పట్టణంలోని చిన్నకొండూరు రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న బాధితులు, దుకాణదారులు శుక్రవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిశారు. 66 ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు చెప్పారని, దాంతో తాము పూర్తిగా ఇండ్లు కోల్పోవడంతోపాటు దుకాణదారులు కూడా తీవ్రంగా నష్టపోతారని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితులకు అండగా ఉంటానని, క్షేత్రస్థాయిలో పర్యటించి ఎవరికీ ఎక్కువ నష్టం కాకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఎవరూ ఆందోళనకు గురికావద్దని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మొగుదాల రమేశ్‌గౌడ్, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, తిరుమల్‌రెడ్డి, శ్రీనివాస్, సురేందర్, శ్రీరాములు, ధనేశ్, రాములు, ప్రవీణ్, వెంకయ్య, అజయ్, కిరణ్, అశోక్, మహేశ్ ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే సామేల్

మోత్కూరులో డ్రై వాటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జూలై 5 : మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద టీయూఎఫ్ఐడీఈ నిధులు కోటి రూపాయలతో చేపట్టిన డ్రై వాటర్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కవిత, వైస్ చైర్మన్ వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నీటిని పరిశీలిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూలై 5 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రగతినగర్‌లో ఇండ్లల్లో నిల్వ ఉన్న నీటిలో దోమ లార్వాను గుర్తించి శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ కప్పులు, పూల కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలని, మురుగు గుంతలను మట్టితో పూడ్చివేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అరుంధతి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్‌బాబు, లత, జానకి, ఆశ కార్యక